# క్షమించవేరూ?

పాలడుగు వెంకటేశ్వరరావు



బాగా ప్రొద్దుపోయింది. సెకండ్ షోలు చూసిన జనాల్ని, గంటలు గణగణ మ్రోగిస్తూ పరుగులెత్తిన రిక్షాలు, ఇళ్ళకు చేర్చి గంట అయింది– వీధులు నిర్మానుష్యమయ్యాయి. రాక్షసుల రాజ్యం ప్రారంభమయింది. గదిలో నీరసంగా వెలుగుతూ వుంది లైట్. తెరిచిన కిటికీల నుంచి తూల్తూ లోపలికి వస్తూవుంది పిల్లతెమ్మెర.

బలహీనంగా కళ్ళు విప్పింది చంద్రిక. కాలివేళ్ళనుంచి మెడదాకా వెచ్చగా మెత్తగా దుప్పటి కప్పివుంది. సీలింగ్ ఫాను అతి మెల్లగా తిరుగుతూ వుంది. శరీరం దూదిపింజలాగా తేలిగ్గా వుంది. ఆత్మ, శరీరంనుంచి విడివడి దూరదూరాలకు పరుగెత్తినట్లూ, మరల తిరిగితిరిగి– ఆకాశంలో తేలి, సముద్రాల్ని లంఘించి, కొండలనుంచి దూకి, శిఖరాలపైకి ఎగిరి, అలాగలాగ తిరిగి – శరీరంలోకి ప్రవేశిస్తున్నట్లూ లీలగా అన్పించినట్లు జ్ఞాపకాల ముక్కలు: ప్రపంచమంతా గిర్రున రంగుల రాట్నంవలె తిరిగినట్లూ, సముద్రాలు పొంగి మీదికి వచ్చినట్లూ, పర్వతాగ్రాలనుంచి అతి వేగంగా భయంకర

మయిన లోతయిన లోయల్లోకి కూలి పోతున్నట్లు కూడాను.

మంచం ప్రక్కగా సైడ్ అల్మారా. దానిపైన అన్నీ మందుల సీసాలు. అల్మారా ప్రక్కన బల్లమీద పళ్ళు, బ్రెడ్ పాకెట్లు, ఐస్ బాక్సు.

చంద్రిక కళ్ళు అతి నీరసంగానే కదిలి ఆ ప్రక్కకు జరుగగా - ఆ మంచానికి దగ్గరగా చేర్చి వాల్చిన పడకకుర్చీలో జారగిలబడి - వాడిలిపోయిన మొహంతో, రేగిన జుత్తూ, గుంటలు పడిన కళ్ళక్రింది మైదానాలూ, నిద్రాహారాలు కరువయి వాలిపోయి, వాడి వత్తలయిపోయినట్లు కళ్ళుమూసుకుని వున్న సూర్యం కని పించాడు। మెడలోంచి జారి వ్రేలాడ్తున్న స్టెత్.

చంద్రిక వులిక్కిపడింది. నరాల్లో రక్తం వేగంగా పరుగులుదీసింది.

ఆమె గుండెల్లో గునపాలతో గుచ్చిన ట్లయింది. నరాల్ని మెలిదిప్పింది, వువ్వె త్తున లేచిన మూగవేదన. బాధతో చంద్రిక మనసు విలవిలలాడింది. కళ్ళల్లో అశ్రువులు సముద్రాలవలె వూరి వుప్పొంగాయ్. కళ్ళు మూసుకుంది చంద్రిక. మూసిన కళ్ళల్లో, మనసు తెరపై జ్ఞాపకాల తోరణాలు, మాసిపోని అవ్యక్త చిత్రాలు. చంపలపై కన్నీటి ధారలు.

బాగా కలిగిన ఇంటిలో - ఒక్కగా నొక్క కూతురు చంద్రిక. అందుకే ఆడింది ఆటగా తను పాడింది పాటగా అల్లారుముద్దుగా పెరిగింది. ఇద్దరన్నలూ, ప్రాణాలు రంగరించి పోసి పెంచుకున్న తల్లిదండ్రులూ మురిపెంగా చూసు కున్నారు. హైస్కూలు దాటి, కాలేజీలో చేరిన రోజుల్లో యవ్వనపు తొలిదశలో అడుగుపెట్టిన చంద్రిక మనసు కొత్త చివుళ్లు వేసింది. అస్పష్టమయిన మధు రోహాలు మనోవీధిలో షికారు చేసాయి. ఆ దశలో—

తెనాలి ఒక స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళినప్పుడు తటస్థపడ్డాడు సూర్యం. వయసు కేరింతల సయ్యాటల మధ్య పరిచయం గాఢమయింది. ఆమె మన సులో స్పష్టంగా ముద్రవేశాడు సూర్యం. అయిదడుగుల ఐదంగుళాల పొడవు. సన్నగా అందంగా ధృఢంగా వున్న శరీరం. బలమయిన పెదాల చివరలు మన స్సుని బంధించే సమ్మోహన శక్తి గల చిరునవ్వులు. మంద గంభీర స్వరం. ఆ మాటల్లో సమ్మోహనకరమయిన ఆకర్షణ శక్తి। బలీయమైన బంధం పెనవేసుకుంది. జీవితాల్ని కలిపి ముడి వేసింది.

'ఈయన మా గురువుగారు. ఆయన సాహచర్యం నా జీవితమనే పుస్తకం లోని ఒక అందమయిన అధ్యాయం. ప్రేమా, అభిమానం, దయా, వాత్సల్యం నామీద అయాచితంగా కురిపించిన ఈ

మనిషి, నాకు దైవసమానుడు. ఆయన నాకు వీడ్కోలు ఇస్తూ చెప్పిన హితవచనాలు నేను ఎప్పుడూ మననం చేసుకుంటూ వుంటాను.'– తన డైరీలో పదిలంగా భద్రపరచిన ఒక ఫొటోని తీసి చూపించాడు సూర్యం, చంద్రికకి.

పెద్ద ముక్కు, విశాలమయిన ఫాలభాగం, ఆదర్శాల ఆలోచనలు నిండిన వెడల్పయిన కళ్లు, గంభీరమయిన మొహం, ఆ చూపుల వెనుక ఆశయాల సముద్రాలున్నట్లనిపించింది. దయా సముద్రాలు ఆ కళ్ళలో కాపురం చేస్తున్నట్లు అనిపించింది.

'వీరి పేరు ప్రొఫెసర్ రాజారావు. పేరు మోసిన సర్జన్. స్టూడెంట్స్‌కీ, కొలీగ్స్‌కీ ఈయన మీద ఎంతో గౌరవం. నేను పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి బయటికి వచ్చేసమయంలో ఆయనన్న మాటలు నువ్వు వినాలి.–' అన్నాడు సూర్యం, ఆప్యాయంగా.

'ఆయన ఏమన్నారు?' అంది చంద్రిక మందహాసం చేసి.

'బాబూ! కష్టపడి చదివి గోల్డ్ మెడల్స్‌తో చదువు పూర్తిచేశావు. నాకు ఎంతో సంతోషంగా వుంది. ఇప్పుడు నువ్వు కాలేజీ వదిలి ప్రపంచంలోకి అడుగు పెడుతున్నావు. నీ చేతిలో ఈ ప్రపంచానికి వుపయోగించగల గొప్ప విద్య వున్నది. నీ చుట్టూవున్న అందరికీ నీ విద్యయొక్క అవసరం వుంది. మన దేశంలో ఇప్పుడు– అపార ధనరాశులను పోగుచేసి, దేన్నయినా కొనుక్కోగల స్థోమతవున్న కొద్దిమంది ధనవంతులతో పాటు, నిరంతరం దోపిడికి గురవుతూ– దారిద్ర్యం, ఆకలి, అవమానం, అనారోగ్యాలపాలు అవుతూవున్న దరిద్ర నారాయణులూ అనేకులు వున్నారు. వాళ్ళమీద కొంచం దయగా ప్రవర్తించడం ఒక మనిషిగా నీ ధర్మం. ఒక మంచి డాక్టర్‌గా నీ కనీసపు కర్తవ్యం కూడాను. అందువలన సాయంకోరి నీ వద్దకు వచ్చిన 'వారి' అవసరాన్ని ఏ పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చెయ్యకు. ఎప్పుడూ ధనసంపాదనే నీ ప్రధానమయిన లక్ష్యంగా ప్రవర్తించకు. విష్ యూ ఆల్ ద బెస్ట్ నేను నీకు చెప్పగలిగిందిఇదే. 'అన్నారు'.

'బాగుంది.' పెదాలు అందంగా విరిచి నవ్వింది చంద్రిక.

'వెంటనే వొంగి ఆయన పాదాల్ని ముద్దు పెట్టుకోవాలనిపించింది నా.. అంత పని చెయ్యలేదు గాని, భక్తితో వొంగి ఆయన పాదాలకి నమస్కారం చేసి వచ్చాను. వస్తూ వస్తూ ప్రొఫెసర్ రాజారావు ఫొటో ఒకటి అడిగి తీసుకుని అందమయిన ఫ్రేము కట్టించి తెచ్చుకున్నాను. ఆ ఫొటో ఫ్రేములో, నా టేబులుమీదే ఎదురుగా వుండి, ఎప్పుడూ ఆయన నన్ను నడిపిస్తూ వుంటారు.' భక్తి భావంతో అన్నాడు సూర్యం.

గురుర్బ్రహ్మ, గురుర్విష్ణూ, గురు
ర్దేవో మహేశ్వరః,
గురుస్సాక్షాత్పరబ్రహ్మో, తస్మై శ్రీ
గురువేనమః

బావమరదులూ, అత్తమామలూ సూర్యానికి ఎన్ని విధాలుగానో చెప్పి చూసారు. పట్నంలో ప్రాక్టీసు పెట్టి దర్జాగా, హాయిగా, తమ కళ్ళ ఎదుటే వుండమని అన్నారు. అందుకు కావలసిన అన్ని హంగులూ ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రిక ఎటూ అనలేకపోయింది. ఆద ర్శాల అంచుల్లో నడవాలని నిశ్చయించు కున్న భర్త సూర్యం. కూతురు సుఖ సంతోషాలే ధ్యేయంగా శతవిధాలా ప్రయత్నించి అల్లుడ్ని గతుకు బాటల నించి, సిమెంటు రోడ్లమీదకి లాక్కు రావాలన్న కన్నవారి వుబలాటం, చివరికి వాళ్ళ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. సూర్యం మొండిపట్టు పట్టాడు.

ఆ వ్యవహారాన్ని చివరికి చంద్రికే తేల్చేసింది.

'ఆయన్తో నా బ్రతుకు ముడివేయ బడింది. ఆయన ఇష్టమే నా ఇష్టం. ఆయనతో అడవిలో కాపురమయినా నాకు సంతోషమే మా ఇష్టప్రకారమే మమ్మల్ని బ్రతకనీయండి.' అంది.

అలాగే జరిగింది.

చంద్రిక పుట్టింటి భోగభాగ్యాల్ని వదిలేసి సూర్యంతో కాపురానికి వచ్చే సింది. కని పెంచినవాళ్లు దూరమయ్యారు. కట్టుకున్నవాడే సర్వస్వమూ అయేడు.

సిమెంటురోడ్లూ, తారురోడ్లూ దాటి, కంకరరోడ్లూ, మట్టిరోడ్లూ గడచి కాలి బాటలవెంట కొన్ని మైళ్ళు నడిచి కొండల మధ్యన, కోనల లోపల, నాగరికతకు చాలా దూరంగా, అజ్ఞానం, దుమ్మూ, ధూళీ, అనారోగ్యం రాజ్యంచేసే ఆ పల్లె టూరిలో ప్రాక్టీసు పెట్టాడు సూర్యం. ఆ చుట్టూ ఎన్నో పల్లెలు. పల్లెల్లో గుడి సెలు. గుడిసెల్లో మనుషులు. మనుషు లకి రోగాలు రొష్టులు బాధలు. ఆ బాధల నివారణే లక్ష్యంగా సైకిలు మీద రాత్రిం బవళ్ళూ తిరగటమే ధ్యేయంగా సూర్యం. సూర్యమే తన సర్వస్వంగా అతని వెంట నీడలా చంద్రిక. ఆ కొత్త కాపురానికి ఆశ్రయమిచ్చిన పర్ణకుటీరం చిన్న అగ్గి పెట్టిలాగా వుంది. పేడతో అలికిన మట్టి నేల. మట్టి పులిమిన తడికల గోడలు. పైన తాటాకుల్తో కప్పు. ముందు-చుట్టూ తడికలున్న వరండా. అక్కడ ఒక టేబులు, కుర్చీ. సూర్యం అందులో కూర్చుంటాడు. వచ్చిన రోగుల్ని పరీ క్షించి, మందులు ఇస్తూ, దయ, ప్రేమా, ఆదరం నిండిన తన మాటల్తో వచ్చిన వాళ్ళకి ధైర్యం నూరిపోస్తాడు. పట్నం నుంచి కొనితెచ్చిన మందులు వారానికొక సారి అయిపోతుంటాయి. మనిషిని పంపీ, లేకపోతే తనే స్వయంగా వెళ్ళి మందులు తెచ్చి బీరువా నింపుతుంటాడు సూర్యం. ఎవర్నీ అడిగేది లేదు. ఇంత అని ఫీజు

లేదు. ఎవరికి తోచింది వారు ఇస్తారు. ఇచ్చినవాళ్ళు పుణ్యాత్ములు. ఇవ్వలేని వాళ్ళు ధన్యాత్ములు డాక్టర్‌బాబంటే దేవుడే. ఆ చుట్టుప్రక్కల పల్లెజనాల నోళ్ళల్లో ఆయన మారాజు. మంచి మనిషి. ఆ మంచి మనిషి ఎదుట టేబిలు మీద ఫొటోలో అతని గురువు రాజారావు.

ముందున్న వరండా వెనకాల ఒక గది. అది బెడ్‌రూం. అందులో ఒక మంచం. దానిపైన దూదిపరుపు. పరుపు మీద శుభ్రమయిన దుప్పటి. ఒక ప్రక్కగా చిన్న అద్దం. అద్దం ముందు బల్లమీద దువ్వెనలూ, నూనెసీసా, పవుదరు డబ్బా. మంచం క్రిందా, అలమారు లోనూ అత్యవసరమయిన వస్తువులు. ఇద్దరిదీ చెరొక సూట్‌కేసూ.

బెడ్‌రూం ప్రక్కన కిచెన్–చిన్న గది. ఆ గదిలో ఒక గోడ అర. అరలో వంటసామాగ్రి, పదిడబ్బాలూ, నాలుగు గిన్నెలూ, నాలుగు గ్లాసులూ గంటా. వెనకాల తడికల బాత్‌రూం. మూలన గుంట లెట్రిన్.

అస్తమానం సూర్యం తనపనిలో సతమతమవుతూ ఉండేవాడు. ఆ వూరి వాడే – విశ్వం అని ఒక కుర్రాడు అతనికి సహాయకుడిగా కుదిరాడు. మందుల బాగ్ పట్టుకొని సూర్యంవెంట వెళ్ళటం, అతన్తోపాటు తిరిగి తిరిగి రావటం, హాస్పటల్‌లో సూర్యం రాసిన మందులు తీసి రోగుల కందించటం అతని పని. చాల మంచి పిల్లవాడు. తీరిక సమయాలలో లోపలికివచ్చి 'అక్కా'అంటూ చంద్రికకి కూడా ఆ పనీ ఈ పనీ చేసిపెట్టేవాడు.

మొదట్లో చంద్రికకి ఏమీ తోచేది గాదు. ఇల్లంతా అలికించింది. తన చేతుల్తో స్వయంగా నాముతో ముగ్గులు అందంగా తీర్చిదిద్దింది. గుమ్మానికి పసుపు పూసి కుంకుమ చారలు దిద్దింది. ఇంటిచుట్టూ కర్రల్తో కంచె కట్టించి పాదులు పెట్టించింది. గునగున మొక్కలు వచ్చేయి. తీగలు సాగి అల్లుకున్నాయి. పూలుపూసి పిందెలు వచ్చేయి. ఆ తర్వాత అవి కాయలు కాసేయి. అందులో కొండంత ఆనందం, తృప్తీ. విచిత్ర మయిన సృష్టి.

ముద్దుల కూతురు కొత్త సంసారాన్ని చూసిపోదామని కారులో వచ్చేరు దామోదరంగారు. కారు దుమ్ము కొట్టుకొని పోయింది. మనుషులూ ధూళిలో మునిగిపోయారు. అసహ్య మనిపించింది. శరీరాల్లోనిఅవయవాలు స్థానభ్రంశం చెందినట్లనిపించింది. కీళ్ళు నలుపులు పెట్టేయి. అక్కడికి పదిమైళ్ళ దూరంలో కలరా వచ్చిందని విని, విశ్వాన్ని తీసుకుని ఆ క్రితంరోజే డాక్టర్ సూర్యం ఆ వూరు వెళ్ళేడు. ఎప్పుడు తిరిగి వస్తాడో తెలియదు. స్నానాలు కానిచ్చాక తీరిగ్గా విషయం కదిపింది పార్వతమ్మగారు కూతురుతో.

'నీ కాపురం చాలా బాగుందమ్మా.'

అని మూలిగింది. అందులో వ్యంగ్యం వుంది.

'అసలు నువ్వు ఇక్కడ ఎట్లా వుంటున్నావమ్మాయ్!!' అని ఆశ్చర్య పోయేడు దామోదరంగారు.

'బాగానే వుంది గదా, నాన్నా' అంది చంద్రిక. ఒంటరితనం, దుమ్మూ, ధూళీ, మురికి, ఈగలు, దోమలూ, సూర్యంలేని రాత్రుళ్ళూ తలపుకి వచ్చేయి. గుండెల్లో కలక మొదలయింది.

'ఈ పల్లెటూరూ, ఈ మనుషులూ, మట్టికొంపలూ! దిక్కులేనట్టుగా పడి వుంటూ, అంతా బాగానే వుందని నువ్వు అన్నా మేము నమ్మలేకపోతున్నాము అమ్మాయ్.'

చంద్రిక తల వంచుకుంది.

'కాలుదీసి క్రింద పెట్టకుండా అల్లారు ముద్దుగా పెరిగావ్. స్వర్గవైభవాలలో మల్లిపువ్వులాగ పెంచుకున్నాం. కుర్రాడు డాక్టరు. బుద్ధిమంతుడు. నువ్వు కోరుకున్నావు- అని ముచ్చటపడి పెళ్ళి చేస్తే, ఇల్లాగ అడవిలో కాపురం పెట్టి నీకు ఎంత అన్యాయంచేసేడే నా తల్లీ' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది పార్వతమ్మ.

చంద్రిక గుండెలలో సముద్రం హోషపెట్టింది.

ఆ మర్నాడుదయం వచ్చేడు సూర్యం. మొహం వడిలిపోయి, తల బాగా దుమ్ము గొట్టుకునిపోయి, బట్టలు మాసిపోయి, అవతారం పూర్తిగా మారిపోయిన అల్లుడ్ని చూసి బాధపడ్డారు దామోదరంగారు. అత్తమామల్ని పలకరించి, మంచీచెడూ మాట్లాడాక, స్నానంచేసి బట్టలు మార్చుకుని మళ్ళీ బయటికి వెళ్ళటానికి సిద్ధమయ్యేడు సూర్యం.

'మళ్ళీ వెంటనే ఎక్కడికి నాయనా?' అడిగారు దామోదరంగారు.

'అక్కడికేనండి. కలరా ఉధృతంగా వుందక్కడ. మందు లయిపోయేయి. తీసుకు వెళ్ళాలని వచ్చేను.' అన్నాడు సూర్యం.

'మందు లయిపోబట్టిగాని, లేకపోతే వచ్చేవాడివి గావన్నమాట. భలేవాడి వయ్యా. ఇవతల నిన్ను నమ్ముకుని కొత్తగా కాపురానికి వచ్చిన భార్య ఏమయిపోతుందన్న నీకు అసలు నీకు లేదన్నమాట. ఆడపిల్ల ఒంటరిగా ఎలా వుంటుందనుకున్నావ్?"

'ఏం మాటలు నాన్నా అవీ?' అంది చంద్రిక బాధగా.

'బాబూ! ఒక్కగా నొక్కపిల్ల. అల్లారుముద్దుగా పెంచుకున్నాం. నా కూతుర్ని అన్యాయం చెయ్యకు నాయనా' అని రాగాలు పెట్టింది పార్వతమ్మ.

దోషిలాగ తలవంచుకుని వుండిపోయిన భర్తని చూసి జాలిపడింది చంద్రిక.

'అన్యాయం లేదూ, పాడూ లేదూ. నువ్వు వూరుకో అమ్మా' అంది.



'వూరుకో వూరుకో అని నా నోరు నొక్కకపోతే, ఆ పెద్దమనిషికి కాస్త మంచీ చెడూ చెప్పి దారికి తెచ్చుకో కూడదా! ఇవేం పద్ధతులే నా తల్లీ. ఎక్కడి మనుషులో?!'

'మీరు మా గురించి ఏం బాధ పడాల్సిన పనిలేదండి. మేం బాగానే వున్నాము. నేను వెళ్ళి త్వరగానే వస్తాను' అన్నాడు సూర్యం.

'కనపడ్తూనే వుంది నాయనా ఆ బాగూ! కడుపు నిండిపోయింది సంతోషంతో.'

భార్యని ఆగమని సంజ్ఞచేసి, దామోదరంగారు మాట్లాడారు. 'నువ్వు బయటికి వెళ్తున్నావు. మళ్ళీ ఎప్పుడు

వస్తావో! మేం వచ్చి అప్పుడే రెండు రోజులయింది. పన్లున్నాయి. అందువలన మేం ఈ పూట వెళ్తున్నాము.'

అలాగే అన్నట్లు తలవూపాడు సూర్యం.

'అమ్మాయిని కూడా, మాతోపాటు తీసుకువెళ్తాం. ఒక నెలరోజులు వుంచుకుని తిరిగి పంపిస్తాం.' అన్నాడు దామోదరం. సూర్యం మొహం తెల్లగా పాలిపోయింది. 'మీ ఇష్టం' అని, గబగబా వెళ్ళిపోయాడు.

చంద్రికే- తను వెళ్ళనంది. తను లేకపోతే అయన్నికి ఇబ్బందవుతుంది. ఆయన తిరిగి తిరిగి వేళగాని వేళల్లో ఇల్లు చేరుతారు. అతని సంగతి కనుక్కునే వారు లేకపోతే అలాగే నీళ్ళు తాగి పడుకుంటారు. అందువలన తను రావటానికి వీలులేదంది. కాసేపు మొత్తుకుని ఎన్నో చదువులు చదివి ముసలాళ్ళు వెళ్ళిపోయారు చివరికి. దిగులుగా మిగిలిపోయింది చంద్రిక.

ఆ మరురోజు రాత్రికి ఇల్లుచేరిన సూర్యం, చంద్రికను చూసి, ఆశ్చర్యంగా- 'నువ్వు వెళ్ళలేదా?!' అన్నాడు. 'ఊహూ.' అని ముసిముసి నవ్వులు నవ్వింది చంద్రిక. 'నా కోసమని అమ్మాయిగారు ప్రయాణం మానుకున్నారు, అవునా?' అన్నాడు. అవునన్నట్లు తలవూపింది. 'థాంక్స్. దేవీ. నీవు లేకుండా ఒంటరిగా ఎలా గడపటమా అని బెంగపెట్టుకున్నాను సుమా.' అంటూ కౌగిట్లోకి తీసుకుని ఆమె తలమీద ముద్దుపెట్టుకున్నాడు. తన్మయంగా కళ్ళు మూసుకుందిచంద్రిక. ఆడదానికి అంతకంటే ఇంకా ఏం కావాలి అనుకుంది.

సంవత్సరం గిర్రున తిరిగింది.

ఒకరోజు బట్టలు వేసుకుని బయటికి బయలుదేరుతున్నాడు సూర్యం.

'ఎక్కడికి శ్రీవారి ప్రయాణం?'

'ఎక్కడికని చెప్పనూ? ఎన్ని చోట్లకో వెళ్ళాలి. ఎన్ని వూళ్ళోతిరగాలి.'

'ఇవాళ సాయంత్రం తొందరగా వచ్చేయండి' వేడుకోలుగా అంది చంద్రిక.

'ఏమో! చెప్పలేను. ఏవిఁటి విశేషమూ?'

'ఈ రోజు... 'సిగ్గుపడింది చంద్రిక.

'ఏమిటి ఈ రోజు?! విశేషమేమన్నా వుందా?'

'వుంది. ఇవాళ మనం తొలిసారి కలుసుకున్న రోజు. అందువలన చాలా ముఖ్యమయిన రోజు' అంది. అతను నవ్వాడు. 'అలాగే. వచ్చేస్తాను.' వుషారుగా బయటికి నడిచేడు సూర్యం, విశ్వం మందులపెట్టె పట్టుకుని అనుసరించగా.

ఆ రోజు చీరచెంగు బొడ్లో దోపుకుని స్వయంగా అతని కిష్టమయిన పదార్థాలు తయారుచేసింది. స్పెషల్‌గా రెండు

స్వీట్లు చేసింది. వేడినీళ్ళ స్నానంచేసి మల్లెపూలు పెట్టుకుని, తెల్లచీర కట్టుకుని అతనికోసం అభిసారికలాగ ఎదురు చూసింది. గుమ్మలో నిలబడి అతని కోసం నిరీక్షించింది. కాళ్ళు నొప్పులు పుట్టాయి. చీకటి పడింది. గుండెల్లో మార్పులు వేగం అందుకున్నాయి. ప్రొద్దుపోయింది. నిరీక్షణను నిరాశ క్రమ్ముకుంది. తలుపు చేరవేసి నీరసంగా కూలబడింది. ఎదురుతెన్నులు చూసింది. అతను రానేలేదు. అలసటకు లోనయిన కనులు మూతలుపడినాయి.

'చంద్రా! చంద్రా!' బుజం తట్టి ఆమెను నిద్రలేపాడు సూర్యం. నిద్ర లేక ఎర్రబడిన కనులు శ్రమకులోనయి వాడిపోయిన మొహం. అస్తవ్యస్తంగా నుదుటిమీద పడిన జుత్తు.

'సారీ డియర్. నిన్ను డిజప్పాయింట్ చేసాను. ఇచ్చిన మాట ప్రకారం రాలేక పోయాను. బట్ అయాం హేపీ దిక్కూ మొక్కూ లేని ఒక కుర్రాడి ప్రాణం కాపాడాను ఇవాళ. తెలుసా? అందుకే నాకు చాలా సంతోషంగా వుంది. ప్లీజ్ గెటప్. ఆకలిగా వుంది. నీరసంగా కూడా వుంది. ఒక కప్పు కాఫీ ప్లీజ్.' పాపం సూర్యం అన్పించింది.

తెల్లవారుతూ వుంది! గుండెలు బాధగా మూలిగాయ్. లేచి కాఫీ పెట్టటానికి లోపలికి వెళ్ళింది చంద్రిక.

ఒకరోజు కారులో భాస్కర్ వచ్చాడు. భాస్కర్ ఆమెకి చిన్న తమ్ముడు

'అబ్బా అక్కా! ఏం వూరే మీది? ఎట్లా బ్రతుకుతున్నారు? అబ్బ! ఏం కుదుపులూ! ఏం దుమ్మూ!! ఛీ. ఈ మురికి అంటే నా కసహ్యమే!'- అన్నాడు.

కాఫీ తాగి వేడివేడి నీళ్ళతో స్నానం చేసాక కుదుటబడి, అసలు సంగతి చెప్పాడు భాస్కర్.

మోహన్‌కి పెళ్ళిచూపులట. సంబంధం స్థిరపడినట్లేనట. అక్కని తీసుకురమ్మని అతన్ని పంపారట. ఇల్లంతా పెళ్ళి సందడితో హడావుడిగా వుందట. వెళ్ళిపోదాం అక్కా అని తొందర చేసాడు. మోహన్ చంద్రికకి పెద్ద తమ్ముడు. కాకినాడలో ఇంజనీరింగ్ ఫైనల్ చదువుతున్నాడు. భాస్కర్‌ది వైజాగ్‌లో మెడిసిన్ మూడవ సంవత్సరం చదువు.

చంద్రిక గాఢంగా నిట్టూర్చింది. ఎగసి పడుతున్న గుండెల్ని అదిమిపట్టింది.

సూర్యం ఆ కొండల్లోకి వెళ్ళి తిరిగి రాక మూడవరోజు.

'మీ బావ వచ్చాక వెడదాంరా అందరం కలిసిపోదాం!' అంది. సూర్యం ఆ రోజు రాలేదు. ఆ మర్నాడూ రాలేదు. భాస్కర్ గొడవచేసాడు.

'మీ బావ రాగానే మేమిద్దరం కలసి వస్తాంలే. నువ్వు వెళ్ళిపో తమ్ముడూ' అంది చంద్రిక. భాస్కర్ వెళ్ళి

మేడు. ఆ రాత్రికి రాలేదు సూర్యం. ఆ మర్నాడు ప్రొద్దుట వచ్చాడు. అతని కూడా ఒక బిక్కచిక్కిన ముసలి రైతు వున్నాడు. అతని కళ్ళల్లో జీవం లేదు.

'ఈ మధ్యన తమరు ఇంటిని మర్చి పోతున్నారు! నిద్రాహారాలు కూడా మర్చి పోతే ఆరోగ్యం స్ట్రయిక్ చేస్తుంది, జాగ్రత్త' అని హెచ్చరించింది చంద్రిక. సూర్యం నవ్వాడు, 'తిండిదేముంది చంద్రా. వాళ్ళతోపాటే ఇంత కాలం ముద్ద తింటాను. నిద్రంటావా, నడుస్తూ నడుస్తూనే ఆ పని ముగించుకుంటాను. నేను రాక్షసుడ్ని డియర్. నాకేం పర్వా లేదు.'

'జోకులు బాగానే వున్నాయి గాని, వేడీనీళ్ళు పెట్టాను. స్నానంచేసి తయారవండి. అర్జంటు పనివుంది. త్వరగా. వూం.'

'వాట్సదీ మాటర్!'

'మోహన్‌కి పెళ్ళిచూపులు. మనం వెంటనే బయలుదేరాలి. క్విక్.'

'సారీ, చంద్రా!'

'ఏం?'

'ఆ బయట కూర్చున్నాడు చూడు, అతనికి ఒక్క కొడుకు. రాత్రినుంచీ విపరీతమైన జ్వరం. చావుబ్రతుకుల్లో వున్నాడు. నేను వెంటనే అతన్తో ఆరు మైళ్ళు నడిచివెళ్ళి ఇంజక్షన్ ఇవ్వక పోతే ఆ పిల్లాడు దక్కడు పాపం!'

'ఈ పక్కల వేరే ఎవరూ డాక్టర్లు లేరా?'

'వుంటే వుండవచ్చు. కానీ....'

'ఈ డాక్టరుబాబు దేవుడు, పుణ్యాత్ముడు. ధర్మరాజు అని పల్లెటూరి జనం అనటమే మీకు ముఖ్యం, అందువలన మీకు బావమరిదికంటే కూడా వాళ్ళే ముఖ్యం కదూ!'

'అదిగాదు చంద్రా....'

'ఏదీగాదుగాని, మాట్లాడకుండా తయారవండి. ఆ మనిషిని వేరే ఏర్పాట్లు చేసుకోమనండి. బండిగట్టుకుని పట్నం తీసుకు వెళ్ళమనండి. అక్కడ బోల్డు డాక్టర్లు. మనం వెంటనే మా యింటికి వెళ్ళాలి. అర్థమయిందా!'

'సారీ, చంద్రా.'

'అంటే అర్థం?!'

'నిన్ను విశ్వాన్ని తోడు పంపించి, మీ వూరు పంపిస్తాను. వెళ్ళిరా. నాకు కుదరదు. సారీ.'


'మీకు నా కంటే కూడా ఈ మనుషులు ఎక్కువన్నమాట?'

'కాదు దేవీ. కాస్త నా మాట ఆలకించు....'

'మరి ఏమిటి చెప్పండి?'

'నా ధర్మాన్ని నేను విడిచిపెట్టలేను. విశ్వాన్ని తోడు తీసుకుని నువ్వు వెళ్ళిరా. ప్లీజ్.'

'అవసరం లేదులెండి. నా గురించి ఎవరూ కష్టపడనక్కరలేదులెండి.'




బట్టలు వేసుకుని, మందులపెట్టె తీసుకుని, ఆ ముసలాయన వెంట వెళ్ళాడు సూర్యం.

చంద్రిక గుండెలమీద గట్టి దెబ్బ. మనసులో విషవాయువులు పారాడటం మొదలెట్టాయి. భోజనం మానేసి పడుకుండిపోయింది చంద్రిక. గుండె పొరలలో ఎన్నో భయంకరమయిన ఆలోచనలు. పాలగ్లాసులో వుప్పుకళ్ళు పడింది. వెక్కి వెక్కి ఏడ్చి ఏడుస్తూనే నిద్రలోకి జారిపోయింది. చంపలమీద కన్నీటి చారికలు.

ఆ సాయంత్రం ప్రొద్దుగూకే వేళ అతను తిరిగివచ్చాడు. అతని మొహంలో ఎంతో సంతోషం. 'అరె! చంద్రా నువ్వు వెళ్ళలేదా?' అన్నాడు. చంద్రిక మవునాన్నాశ్రయించింది. 'నీకు గుడ్ న్యూస్. ఆ కుర్రాడు బ్రతికాడు తెలుసా? ! వాళ్ళందరూ ఎంత ఇదిగా నన్ను చూసారు! వాళ్ళ కళ్ళల్లో ఆ కృతజ్ఞతా, ఆ అభిమానం, ఆ గౌరవం.... నేను మర్చిపోలేను.'

'స్టాపిట్' అరిచింది చంద్రిక. 'అయి డోంట్ వాంట్ ఆల్దిస్ ట్రాష్.'

తెల్లపోయి చూసాడు సూర్యం.

వారంరోజుల తరవాత దామోదరం వుత్తరం వ్రాసారు. 'కూతురు కూతురని మేము కాళ్ళు తొక్కుకోవటమేగాని, నీకు మేం అసలు జ్ఞాపకం వున్నట్లు లేదు. పెళ్ళికాగానే నీకు మేము అంత కానివాళ్ళమూ, పరాయివాళ్ళమూ అయిపోయామా, తల్లీ! అతను రాకపోతే మానే, నువ్వయినా మోహన్ పెళ్ళిచూపులకి వచ్చివుంటే మేం

ఆనందించేవాళ్ళం గదా. మా మీద అంత కర్తృత్వం వహించటానికి మా పొరపాటు ఏమిటి తల్లీ? నీ గురించి మీ అమ్మ బెంగపెట్టుకుని సరిగా అన్నం తినటంలేదు. ఆవిడకి ఇటీవల బ్లడ్ ప్రెషర్ ఎక్కువయింది.' అంటూ నిష్ఠూరంగా రాశారు.

అది చదువుకుని చాలా బాధపడింది చంద్రిక. ఆ పూట భోజనం మానేసింది. చాలా రోజులు ఆ విషయం తల్చుకుని కుమిలిపోయింది.

పదిహేను రోజుల్తరువాత కారుమీద మోహన్ వచ్చాడు.

'అక్కా. ఈ పదిహేనో తారీకున నా పెళ్ళి. మీ ఇద్దర్నీ తీసుకువెడదామని స్వయంగా వచ్చాను. అక్కడ బోల్డు పన్లు. బావ ఏరీ? బయలుదేరదామా?' అన్న అతని ప్రశ్నకి సమాధానం చెప్ప లేకపోయింది చంద్రిక.

ఆ వుదయమే వెళ్తూ రెండు రోజులు దాకా రానని చెప్పిన సూర్యం మాటలు గుర్తుకి వచ్చాయి. ఎందుకు ఇలా జరుగుతూ వుంది!!

'నువు వెళ్ళిపో తమ్ముడూ. బావ రాగానే మేం వెంటనే బయలుదేరి వస్తాం' అంది.

'నువ్వు ఎప్పుడూ ఇంతే అక్కా. నీ గురించి అమ్మా, నాన్నా, అందరం ఎంతగా బాధపడ్తున్నామో అర్థం చేసుకోవు!' అని కన్నీరు పెట్టుకున్నాడు. బావ రాగానే వెంటనే బయలుదేరి రమ్మని చెప్పి వెళ్ళిపోయేడు. పెళ్ళిపనులు వలన తను ఆలస్యం చేయటానికి కుదరదు అన్నాడు.

మూడోనాటికి దిగాడు సూర్యం. అప్పటికే మనసు అరచేతిలో పెట్టుకుని అతని కోసం అసహనంగా ఎదురు చూసింది చంద్రిక.

'హారిబుల్, చంద్రా. నాయుడుగారు తెల్సుగదా! వాళ్ళ ఇంట్లో అందరికీ జ్వరాలు. విరేచనాలు కూడా. కలరా అని అనుమానంగా వుంది....' అన్నాడు సూర్యం.

'మోహన్ మీకోసం వచ్చి వెళ్ళాడు. అతని పెళ్ళి నిశ్చయమయిందిట....'

'పాపం! నాయుడుగారు ఎంత మంచి మనిషీ! నేనంటే ఎంత గౌరవం, ఇంట్లో అందరికీ అలా అయిందని ఆయన ఎంత దీనంగా, దిగులుగా వున్నాడూ... ప్చ్....'

'మనిద్దర్నీ వెంటనే తీసుకుని రమ్మని వాళ్ళు కారు పంపారు. మనం వెంటనే... మీ గురించి నేను ఎదురుతెన్నులు చూస్తున్నాను. ఇప్పటికే ఆలస్యం....'

'వెంటనే బయలుదేరి వస్తాను. ఏం దిగులుపడవద్దని చెప్పి ఇలా వచ్చాను. పాపం. చాలా అర్జంటుగా....'

'అర్జంటుగా మనం బయలుదేరి వెళ్ళాలి. లేకపోతే బావుండదు....'



'అర్జంటుగా నేను వెళ్తున్నాను. మళ్ళీ ఎప్పుడు వస్తానో తెలియదు. జాగ్రత్తగా వుండు.'

'ఆగండి.'

గబగబ వెళ్ళబోయిన సూర్యం ఆగాడు. పరుషంగా తీక్షణంగా వాడిగా చూసింది చంద్రిక.

'నేను చెప్పిన మాటలు అసలు విని పించుకోటం అన్నది లేదా? మీరు ఏం మనుషులూ?!'

'నేను చెప్పింది నీకు అర్థమవలేదా? యూ ఆర్ సెల్ఫిష్, బేబీ.'

'షటప్' తీవ్రంగా అంది చంద్రిక. తెల్లబోయి కొన్ని క్షణాలు, ఆమె వంక

చూసి నవ్వి, గబగబ వెళ్ళిపోయాడు సూర్యం. నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించాడు. సందేహం లేదు. పాలు విరిగిపోయాయి. చల్లని సంసారంలో వేడిగాలులు వీచాయి. తీవ్రమయిన తుపాకులు మనస్సును అటుపోటులకు గురిచేసాయి. చాలసేపు మధనపడి ఒక నిశ్చయానికి వచ్చింది చంద్రిక. ఎంతో బాధపడి ఆ నిర్ణయం తీసుకుంది.

తను ఇంక ఆ సంసారం చెయ్య లేననీ, అతనితో ఆ పరిస్థితుల్లో కలిసి కాపురంచెయ్యటం కుదరదనీ అందు వలన ఆ బంధాన్ని తెంచుకుని తనవారి దగ్గరకు వెళ్ళిపోతున్నాననీ, తనని మరిచి పోయి ఇక సంపూర్ణంగా ప్రజాసేవలో మునిగిపొమ్మనీ సూర్యానికి పెద్ద వుత్తరం రాసింది. తన సామాన్లు అన్నీ సర్దుకొని, సూట్ కేసులో పెట్టుకుంది. ఆ వుత్తరాన్ని వణికే చేతుల్తో అతని టేబులుమీద వుంచి, దానిపైన పేపరు వెయిట్ పెట్టింది. బయటకు వచ్చేసి ఇవతల పడింది. నిట్టూర్చింది.

'అల్లుడుగారు ఏడమ్మా?'

'అల్లుడు తర్వాత వస్తానన్నారా? పోనీలే, నువ్వు వచ్చావు. సంతోషం తల్లీ.'

'అక్కా, బావ ఇవాళ కూడారాలేదేం? రారా!!'

అందరి ప్రశ్నలకూ చంద్రిక మవునమే సమాధానం అయింది. ఆ మౌనంలో ఎన్నో సముద్రాలు.

మోహన్ పెళ్ళి ఘనంగా జరిగింది. ఎంత కాదనుకున్నా చంద్రిక మనసు క్షణక్షణమూ సూర్యం రాకకోసం ఎదురుచూసింది. కానీ సూర్యం రానే లేదు. ఇక రాడేమో!

'అల్లుడు రానేలేదు. ఏం మనిషి?'

'బావగారు ఎందుకు రాలేదో?'

నాలుగోనాడుచంద్రిక మంచంఎక్కింది. ఫెళ్ళున నూటనాలుగు డిగ్రీల జ్వరం వచ్చింది. మూసిన కన్ను తెరవకుండా పడివున్న కూతుర్ని ఎందరు పెద్దపెద్ద డాక్టర్లు ట్రీట్ చేసినా జ్వరం తిరుగు మొహం పట్టకపోవటంతో పార్వతమ్మ బెంబేలుపడిపోయింది. కాలుగాలిన పిల్లిలాగ ఇల్లంతా కలియదిరిగింది.

'అమ్మాయికి ఇట్లా వుందని అల్లుడికి కబురు పంపండి' అని భర్తకి చెప్పింది.

ఆ ప్రకారమే వుత్తరం రాసి మనిషి కిచ్చి పంపారు దామోదరంగారు. సంగతి తెలిసి— సాయంత్రానికల్లా, ఆ మనిషితో పాటు వచ్చిపడ్డాడు సూర్యం.

'చంద్రా ఎక్కడండీ?' ఆదుర్దాగా అడిగాడు. చిక్కిపోయిన ఆ అవతారాన్నీ దుమ్ముగొట్టుకున్న ఆ బట్టల్నీ దామోదరంగారు అదొకవిధంగా చూసి, కండువా బుజానవేసుకుని విసురుగా బయటికివెళ్ళారు. మోహన్, భాస్కర్‌లు

ముభావంగా బావకి మర్యాదలు చేసారు. మొహం కడుక్కుని, తువాలుతో తుడుచుకుని— కాఫీ తెచ్చిన భాస్కర్‌ని అడిగాడు సూర్యం.

'అక్క ఎక్కడా, భాస్కర్?'

చేత్తో మేడపయికి చూపాడు భాస్కర్. బావమీద అతనికీ కోపంగానే వుంది. కాఫీ ఐనా తాగకుండానే, గబగబా మెట్ల మీదకి పరుగెత్తాడు సూర్యం.

మేడమీద గదిలో, సన్నగా తోటకూర కాడలాగా అయిపోయి, చిక్కి శల్యమయిపోయి, ఏళ్ళ తరబడి ఎదురు చూసిన పూర్ణిమలాగ, కళ్ళు మూసుకుని పడివున్న చంద్రికను చూసాడు. నిట్టూర్చాడు. అతని నరాల్లో సంచలనం చెలరేగింది.

సైడ్ అల్మారామీద వున్న ప్రిస్క్రిప్షన్ చీటీలూ, సీసాల్లో వున్న మందులు చూసాడు. థర్మామీటర్‌తో టెంపరేచరు చూసి, స్టెతస్కోప్‌తో పరీక్షలు చేసాడు శ్రద్ధగా. మెల్లిగా చంద్రికను లేవదీసి పొదివిపట్టుకుని, టాబ్లెట్సు మింగించి, బత్తాయిరసం తాగించాడు. టయిము చూసుకుని - అలసట గుర్తువచ్చి పడక కుర్చీలో వాలాడు.

చంద్రిక వళ్ళు చల్లబడింది.

మొహంనిండా చమటలు పట్టాయి.

కళ్ళు విప్పి, అతనికోసం వెతుక్కుంది. అలసటగా పడక్కుర్చీలో వాలిపోయి కళ్ళు మూసుకుని వున్న సూర్యం: చిక్కిపోయిన అతని మొహంలో వింత తేజస్సు! స్వార్థాన్నెరుగని సేవాభావం, దయాగుణము తెచ్చిన వెలుగు!

చంద్రిక కళ్ళల్లో నీరూరాయి. ఎటువంటి మనిషి ఎలా మారిపోయాడు!

భోజనం చేయమని క్రిందనుంచి ఎన్నో కబుర్లు వచ్చాయి. ఆకలిగా లేదని చెప్పి అతను వెళ్ళలేదు. దామోదరంగారే స్వయంగావచ్చి పిలవాలని గుమ్మందాకా వచ్చారు. అతనికి నోరు పెగలలేదు. దుఃఖం ముంచుకొనివచ్చి, నోరు పెగలలేదు. అసహాయుడై వెనుదిరిగిపోయారు, దామోదరంగారు.

సూర్యాన్ని అలాగే చూస్తూ నిద్రలోకి జారుకుంది చంద్రిక మళ్ళీ.

రాత్రి గడచి తెల్లవారుతూవుంది. ఉషారేఖలు విశ్వమంతటా వ్యాపిస్తున్నాయి.

బద్ధకంగా కళ్ళు తెరిచాడు సూర్యం. అప్పటికే నిద్రలేచిన చంద్రిక అదే పనిగా అతన్నే చూస్తూ వుంది. ఆమె కళ్ళనిండా సంతోషం. ఆరాధన. ప్రేమ భావన.

'నౌ యూ ఆర్ ఆల్రయిట్ వెరీగుడ్' అన్నాడు సూర్యం నవ్వి.

'థాంక్యూ.' గొణిగింది చంద్రిక. సిగ్గుతో తలవంచుకుంది.

'నీ వుత్తరం చదివాను, అయాం సారీ.

ఎరిగ్లీ సారీ.' సూర్యం గొంతు వణికింది. 'నన్ను క్షమించు చంద్రా! ఎక్కడ వున్నా నీ క్షేమమే నేను కోరుకునేది. కాని నేను నిన్ను సుఖపెట్టలేకపోయాను.' అనిమేషంగా అతన్నే చూసింది చంద్రిక. ఆమె పెదాలు వణికాయి.

'నువ్వు నా గురించి ఎంతో బాధపడి వుంటావు. అందుకు నన్ను క్షమించు. నేను దురదృష్టవంతుడ్ని. కానీ మన దేశంలో నా కంటే ఎక్కువ దురదృష్టవంతులు చాలామంది ఉన్నారు. ఏం చేయనూ? నా పిచ్చి నాది. నా పద్ధతి నాది. నా గురువుగారి శిష్యుడ్ని నేను.'

చంద్రిక కళ్ళల్లో నిరూరింది. మనస్సు సంక్షుభితమయింది.

'ఇక ఫర్వాలేదు. ఇప్పుడు నీకు బాగానే వుంది. ధైర్యంగా వుండు. బీ హాపీ. ఇంక నీకు ఆ పీడకలలూ వుండవు. మన దార్లు చీలిపోయాయి గదా! మరి నేను వస్తాను. వెళ్ళనా?' అతని గొంతు వణికింది. 'వెళ్ళండి కాని ఒక్క మాట...' నీరసంగా అంది చంద్రిక.

అక్కడనుంచి వెళ్ళటానికి సిద్ధమయినవాడు సూర్యం.

'నన్నుకూడా మీతో తీసుకువెళ్ళండి. మీరు లేని నేను లేను. దయచేసి ఆ వృత్తాన్ని చింపేయండి. మీ మనసునుంచి చెరిపేయండి. నన్ను క్షమించండి. క్షమించలేరూ? ప్లీజ్, నేను మీ భార్యని కదా?' అంది చంద్రిక దీనంగా, ఆర్ద్రంగా.

అతని మొహంలోకి వెలుగు తన్నుకు వచ్చింది. జాలితో కరిగిపోయాడు.

అతని పెదాలపై మందహాసం వెల్లివిరిసింది. గుండెల్లో దయ పొంగింది. అతని కళ్ళనిండా కృతజ్ఞతా భావం నిండింది - తక్షణం తన ప్రయాణాన్ని విరమించి తిరిగి ఆ కుర్చీలో కూర్చుండిపోయేడు. చంద్రిక నవ్వింది. గతాన్ని మరిచిపోయి కిలకిల నవ్వింది. ఆ నవ్వులో వెలుగులు విరిసేయి.

